# మారుపడిన ఉత్తరం

రచన :
"సుజనశ్రీ"

ఆరోజు శనివారం కావడం మూలాన పన్నెండున్న రకే ఇంటికి వచ్చేశాడు కామేశం. భార్యశేషావతి ఇరుగు పొరుగు అమ్మలక్కలతో ఏవో ముచ్చట్లు చెబుతోంది. చిరాగ్గా నెక్‌టై విప్పేసి స్టాండుకి తగిలించాడు. ప్రక్కనే బల్లమీద ఏదో కవరు కనిపించింది. చిరాకుగా ఉండటం మూలాన ఎడ్రసు చూడ్డానికి అతనికి ఓపికలేకపోయింది బూట్లు విప్పేసి ధోవతి కట్టుకుని చరచరా దొడ్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కుని పీటముందు కూర్చున్నాడు.

"ఏమిటండీ ఇవాళింత చిరాగ్గాఉన్నారు?" అనడిగింది శేషావతి వడ్డిస్తూ.

"కడుపులో మాడుతూవుంటే చిరాకుపుట్టకేమతుంది?" గబుక్కున అనేశాడు కామేశం. నిజానికి తన చిరాకు కారణం తనకేతేలీదు. ఆకలనేది రోజూఉంటున్నదేకాని ఈ చిరాకు ఇవాళే వచ్చింది. దానికి కారణం ఆలోచించ టానికి కూడా అతడి కవసరం లేకపోయింది.

పరాకుగా భోజనం ముగించి వచ్చి కుర్చీలో కూల బడ్డాడు. శేషావతి ఎంగిలి కంచం కడిగేసి వెళ్ళి అత్త గారి ప్రక్కనే అమ్మలక్కల మధ్య చేరింది. కామేశం టేబుల్‌మీది ఉత్తరాన్ని చేతిలోనికి తీసుకున్నాడు "ఎన్. శేషావతి కెరాఫ్. ఎస్. కామేశం, థర్డ్‌లైన్, బ్రాడీపేట గుంటూరు." ఎడ్రసు చదివేసరికి అతనికే ఆశ్చర్యం వేసింది. శేషావతి!.... తన భార్యకు ఎవరు వ్రాసిఉం టారీ ఉత్తరం. బహుశా తన చెల్లెలి కయ్యుండ వచ్చు నేమో! చెల్లాయి పేరుగూడ శేషావతే కదా! కాని చెల్లెలు ఇక్కడ లేదాయే! వాల్తేరులో ఉన్నది. ఇంకా యూనివర్సిటీ కాలేజీకి సెలవులివ్వలేదేమో! ఇంకాఇంటికి రాలేదు. త్వరలో వస్తున్నానని వ్రాసింది. మరి ఎవరి కయ్యుంటుందీ ఉత్తరం? ఎక్కడనుంచి వచ్చిందోమరి! పెన్ ఫ్రమ్ అడ్రసు గూడరాసిలేదు. చించితే తెలియ

బందరు
27-9-56.

శేషూ—

నీవు వెళ్ళిపోయి నప్పట్నుంచి రోజు గడపడమే కష్టముగా ఉండి. వారం పదిరోజుల్లో వస్తున్నాను. మన సంగతి తేల్చుకోవటానికీ, ఈతడవ మన కార్యక్రమం వాయిదా పడెయ్యటానికి వీలులేదు.

నీ ప్రియుడు
మూర్తి

ఎవరీ మూర్తి? వీడికీ తనభార్యకు ఏమిసంబంధము? ఎన్నాళ్ళనుంచి జరుగుతున్నయ్యి ఈ ఉత్తరాలు? కవరు త్రిప్పి చూశాడు. బందర్ అని పోస్టల్ స్టాంపు ఉన్నది. తన అత్తవారిది బందరే!.... అనుమానంలేదు. తన భార్యకూ ఈ మూర్తికీ....ఉంది బహుశా తమ వివాహా నికిముందు వారిద్దరూ రోమియో జూలియట్టులయిఉంటారు ఎంత కపటం! అమృతపాత్రగా భావిస్తున్న తన భార్యలో ఇంత విషం ఉంటుందని ఏనాడూ అనుకోలేదే! ఎంత నటన. భార్యని ఎంత ప్రాణప్రదంగా చూసుకుంటున్నాడు దానికి ప్రతిఫలమిదా? ఛీ...ఆడజాతే ఇంత!.... కామే శానికి భూమి గిరగిరా తిరుగుతున్నట్లనిపించింది. ఇది అందరకు తెలిసిపోతే ఎంత అప్రదిష్ట. తనకి ఊళ్ళోఉన్న పేరూ, పలుకుబడీ అన్నీ మంటగలిసి పోవూ? తన భార్యను ఏంచేస్తే ఈ పాపానికి ప్రాయశ్చిత్తం జరుగు తుంది? కోపోద్రేకంలో శేషూ అని కేకపెట్టబోయి, ఇది తగిన సమయం కాదులే అని మళ్ళీ అణుచుకున్నాడు తన ఉద్రేకాన్ని.

రాత్రి భోజనాలు ముగించిన తర్వాత కామేశం తన ఉద్రిక్తతను ఎలా వెల్లడి చేయాలో మనస్సులో రిహార్సల్సు చేసుకుంటూ పందిరి మంచంమీద దొర్లుతున్నాడు. [illegible] దోమతెరను తొలగిస్తూ "ఇదేమిటి? రోజూ

భోజనం కాగానే తమలపాకుల కోసం కేక పెట్టేవారు ఇవాళ ఇలా ఉన్నారేం?" అని కిల్లీఅందించ బోయింది.

"అక్కర్లేదు పో!" అన్నాడు కామేశం.

"అదేమిటండీ అలాగంటారు? మీరురోజూ సాధిస్తున్నారని మంగమ్మగారి దగ్గరకెళ్ళి నేర్చుకు వచ్చాను. తీసుకోండి"

"ఏం? ఏమన్నా విషం పెట్టావా అందులో!" అన్నాడు కామేశం ముఖం ప్రక్కకు త్రిప్పుకుని.

"చాల్లెద్దురూ!" అంటూ కిల్లీ నోట్లో పెట్టబోయింది. శేషావతి. ఛెళ్ళుమని చెంపమీద భర్తచెయ్యి పడడంతో ఆమె చేతిలోని కిల్లీ క్రిందపడి పోయింది. శేషావతి భయాశ్చర్యాలతో భర్త ముఖంలోకి చూసింది నిప్పులు గ్రక్కుతూ కాలయముణ్ణి గుర్తుకు తెస్తూ ఉన్నది అతని ముఖం.

"తెలిసి పోయిందిలే నీనాటకం? రంకూ బొంకూ ఎన్నాళ్ళు దాగుతయ్యి నాపీడ విరగడైపోతే ఆ మూర్తి గాడితో కులుకుతూ సంసారం చేద్దామనా!"

"మీరనేదేమిటో నాకర్థం కావడం లేదు. మూర్తి ఎవరు?"

"నంగనాచిలా ప్రవర్తిస్తున్నావే! ఏమిటీ ఉత్తరం?" అంటూ లాగూజేబులోని ఉత్తరాన్ని బయటకు తీశాడు, ఉత్తరాన్ని చూస్తూనే శేషావతి వణికి పోయింది.

"క్షమించండి. మీరు పొరబాటు పడుతున్నారు. ఆ మూర్తి ఎవరో నాకు తెలియదు. ఏవేవో అపోహలుపడుతున్నారు మీరు"

"ప్రత్యక్షంగా అవుపడుతుంటే అపోహలా?"

"ఇంతేనా? రెండేళ్ళనుంచి కాపురం చేస్తున్నాం నన్ను అర్థం చేసుకోలేదా?"

"ఈనాడు పూర్తిగా అర్థంచేసుకున్నాను. పయోముఖ కుంభానివి" అంటూ తను చేస్తున్నదేమిటో తెలియకుండానే ఆమెను కసిదీరా కొట్టాడు. "ఇక నువ్వు నాఇంట్లో ఉండనక్కర్లేదు. నీ గుడ్డలన్నీ సర్దుకో!" అని గద్దించాడు గాడ్రేజ్ బీరువా తాళం తీస్తూ.

మీ అనుమానాలకు నన్ను బలిస్తారా?"

"బలి! నీ ఆటలు ఇంక నాదగ్గరసాగవు. ఊ అన్నీ సర్దుకో!" అన్నాడు కామేశం.

"అదేమిట్రా? ఎన్నడూలేంది దాన్ని ఇవాళ అలా కాల్చుకు తింటున్నావు ఏంజరిగిందిరా!"

"మీకనవసరం అమ్మా! నువ్వూరుకో"

"ఏమిట్రా ఊరుకునేది. రెండోనెల గర్భిణిని ఇలా గర్రాంచూసేది. నీకడుపునకాయకాస్తే చూసిపోదామనుకుంటూంటే పెద్దవాళ్ళం మేంఉండగానే ఈ అఘాయిత్యం"

"ఈ విషయంలో నువ్వు జోక్యం కలుగ జేసుకోకమ్మా.... ....ఊ నిలబడ్డావేం. నడు."

శేషావతి అయిష్టంగానే గుర్రబ్బండిఎక్కింది. కామేశం బండిలో ఎక్కుతూ "స్టేషనుకు పోనివోయ్!" అన్నాడు

"అయినా ఇంత మొండివాడయాడేమిటి వీడు. ఇదివరకెన్నడూ కీచులాడుకుని గూడ ఎరుగరు" అని ముక్కుమీద వేలేసుకుని వాకిట్లో నిలబడి పోయింది. కామేశం తల్లి.

"ఈకాలపు వాళ్ళకి నచ్చచెప్పటం మనతరం కాదు. కానీలే.దిగులుపడకు మళ్ళీవాళ్ళే రాజీపడతార్లే!"అన్నాడు కామేశం తండ్రి.

ఒక్కతే వచ్చిన కూతుర్ని చూసి ఆశ్చర్యపోయారు. శేషావతితల్లిదండ్రులు. దుఃఖాన్ని దిగమింగ్రేసి "వారుఏదో ఊరికి ట్రిప్‌మీద వెళ్తున్నారు పదిరోజుల దాకా రారట నాకూమిమ్మల్ని చూడాలనిపించింది. అందుకనివచ్చాను" అని సమాధాన మిచ్చింది.

రాత్రింబగళ్ళు శేషావతి ఉత్తరాన్ని గురించి బాధపడసాగింది. ఎన్నిసార్లు చూసుకున్నదో లెక్కలేదు. ఎవరీ మూర్తి వాడికి తనెలా తెలుసు?

నాలుగురోజులు గడిచినయ్. కామేశం చెల్లెలు ఆమె పేరూ శేషావతే.... వాల్తేరులో బి. ఏ. ఆనర్సు చదువుతున్నది. ఆమె దసరా సెలవలివ్వంగానే బెజవాడలో తన స్నేహితురాలింట్లో నాలుగు రోజులుండి గుంటూరు వచ్చేసింది. మధ్యాహ్నంకామేశం ఇంటికిరాగానే "అన్నయ్యా వదినేదిరా!" అనడిగింది.

"పుట్టింటి కెళ్ళింది"

"ఇప్పుడెందుకు?"

"ఇప్పుడెందుకూ అంటే నాకేం తెలుస్తుంది? రెండో నెల గర్భిణీమరి ఆమెకలా మనసయింది!" అబద్ధం ఆడే నాడు కామేశం

"సీతాదేవి రాముణ్ణి అడవులకు తీసుకెళ్ళమన్నట్టుంది. సరేగాని నాకు ఉత్తరాలేం రాలేదుగా!" అంటూనే లోపలకు వెళ్ళింది తల్లి పిలుపు విని. కామేశం గుండెల్లో కనేడియన్ ఇంజన్ కూత వేసింది. కొంపతీసి ఆ ఉత్తరం తన చెల్లెలికి కాదుగదా! ....ఛీ. తన చెల్లెలి కెవరూ ప్రేమికులు లేరే.!

"రాలేదు!" అని మాత్రం గొణిగాడు. ఇంతలో పోస్టుమెన్ ఒక కవరిచ్చి వెళ్ళాడు. ఎడ్రసు చూశాడు. అదే ఎడ్రసు. అదే దస్తూరి. ఫ్రమ్ ఎడ్రసు గూడ వెనకటి ఉత్తరందే, ఎవరీ మూర్తి అని ఉత్తరాన్ని చేతిలోకి తీసుకొని చూస్తుండంగానే చెల్లెలు శేషావతి వచ్చి "అది నాదేరా అన్నాయ్!" అంటూ చేతిలోని ఉత్తరాన్ని లాక్కుంది. కామేశం తెల్లబోయాడు.

"నీదా ఇది!"

"అవును!" అన్నది చెల్లెలు సిగ్గుతో ఉత్తరం చేతులోకి తీసుకుంటూ.

"ఎవరా మూర్తి!" అని గటుక్కున అడిగేశాడు, చెల్లెలు తెల్లబోయింది.

"నీకేలా తెలుసు?" అన్నది. కామేశంకు షాక్ తిన్నట్టయింది, గుక్క తిప్పుకుని "ఇదివరకో కవరు వచ్చింది నాలుగురోజులు క్రిందట. దానిమీద ఆమె అడ్రసు చూశాన్లే. అంతకూ అతనెవరు?"

"ఆ సంగతి అమ్మనడుగు చెబుతుంది. మరి ఆ కవరేది?"

"దాన్ని టేబుల్ మీద పెట్టాను. మరి ఏమయిందో" అన్నాడు తను చేసిన అవమానపు పనిని తప్పించుకుంటూ.

"మంచిపని చేశావులే" అంటూ సిగ్గుగా తన గదిలోకి వెళ్ళిపోయింది ఉత్తరాన్ని చించుతూ.

తల్లి చెప్పిన సమాచారం విన్నాడు కామేశం అప్పటికి గాని తను చేసింది పొరపాటని తెలుసుకోలేక పోయాడు.

వెంటనే హడావిడిగా రైలు స్టేషనుకు వెళ్ళి బందరుకు టికెక్కట్టు తీసుకుని రైల్లో ఎక్కి కూర్చున్నాడు. ఎంత తప్పు చేశాడు తను. తన భార్య పరమసాధ్వి. తను ఆఫీసు నుంచి రావటం పది నిముషాలు ఆలస్యమయితే వాకిట్లో తన కోసం ఎదురు చూస్తుండేది. తన మేనమామ కొడుకు ఒకడు .... కొంచెం దూరపు బంధువే....వాల్తేరులో యం. కామ్. చదువుతున్నాడు. వాడికి తన చెల్లెల్నివ్వాలని అందరి నిశ్చయం. వారిద్దరి ప్రణయలేఖే తన చేతికొచ్చిన ఉత్తరం. వాల్తేరు వదిలిన శేషావతి సరాసరి ఇంటికి వస్తుందని ఉద్దేశించి ఆ మరునాడే తన బావ రామచంద్రమూర్తి ఉత్తరం వ్రాశాడు. కాని శేష బెజవాడలో ఆగిపోవటం వల్ల ఆమెకంటె ముందరే ఆ ఉత్తరం గమ్యస్థానానికి వచ్చి అంతరాయం తెచ్చిపెట్టింది.

రైలు దిగి చకచకా మామగారింటికి నడవసాగాడు. నడిమధ్యాహ్నం ఎండను గూడ లెక్క చెయ్యకుండా మామగారిల్లు చేరుకున్నాడు. రిక్షాలో ఎక్కాలన్న ఆలోచనే అతని వేడి బుర్రలోకి రాలేదు. మామగారు పంచలో గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. అత్తగారు ఇంట్లోలేరు. బూట్లు బయట వదిలి లోపలికి అడుగుపెట్టాడు. అక్కడ ...తన భార్య.... శేషావతి.... దీనంగా చూస్తూ నిల్చున్నది.

"శేషూ! నిన్ను తీసుకొనివెళ్ల టానికే వచ్చాను. పొరబాటు జరిగింది. గతాన్ని మరచిపో శేషూ!" అన్నాడు ఆమెను తన హృదయానికి హత్తుకుంటూ.

